క్లుప్తంగా

కురబలకోటకు నేడు ఎంపీ మిథున్ రెడ్డి రాక

కురబలకోట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శనివారం ఉదయం కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో జరిగే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి తెలిపారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజక వర్గాల సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాజ్ బాషా ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

5న మండల సమావేశం

ములకలచెరువు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ సాయిలీల తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

రామిగానిపల్లెకు తాగునీటి సౌకర్యం

తంబళ్లపల్లె : మండలంలోని పరషతోపు పంచాయతీ రామిగానిపల్లెకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన తాగునీటి సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ పార్వతమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ తెలిపారు. తాగునీటి సమస్యను స్థానికులు రాజారెడ్డి, శ్రీనివాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయితీ నిధులు రూ.3.30లక్షల ఖర్చుతో నూతన బోరు 600 అడుగులు వేయగా నీరుపుష్కలంగా పడింది. కొత్త మోటారు, పైపులు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల రిలే నిరాహారదీక్ష

తంబళ్లపల్లె : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీఈఈఏ సభ్యులు రిలేనిరాహారదీక్ష చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఈఏ సభ్యులు సరస్వతి, రమణయ్య, శంకర్, హేమంత్‌కుమార్, గోవింద్, హరి, పలుశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

వాల్మీకిపురం : పట్టణంలోని రాంనగర్ కాలనీ, దయ్యాలబండ, సీపీ మహల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని వారు కోరారు.

రేపటి నుంచి పాలేటమ్మ తిరునాల

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామం గుట్టపాళెం కస్పాలో వెలసిన గ్రామదేవత పాలేటమ్మ తిరునాల ఆదివారం నుంచి రెండు రోజుల పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలరెడ్డెప్పనాయునివారు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారి మెట్టినిల్లు వరి శిద్దపూజ, దీలు బోణాలు సమర్పణ, రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు. సోమవారం సాయంత్రం కల్లిపాటు ఉత్సవంతో తిరునాల ముగుస్తుందని తెలిపారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

మదనపల్లె సిటీ : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూ రీ సర్వే వేగవంతం చేయాలి
– మదనపల్లి ఆర్డీఓ ఎంఎస్ మురళి

కలికిరి : మండలంలో జరుగుతున్న భూ రీ సర్వే వేగవంతం చేయాలని మదనపల్లి ఆర్డీఓ ఎంఎస్ మురళి అన్నారు. మండలంలోని కొర్లకుంట గ్రామం బీరేవాండ్లపల్లి, కలికిరి గ్రామ పరిధిలోని బట్రెడ్డిగారిపల్లి వద్ద జరుగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. భూ రీ సర్వేలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై గ్రామ సచివాలయ సర్వేయర్లు, మండల సర్వేయరు, సిబ్బందికి సూచనలిచ్చారు. రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి భూ హద్దులు చూపి సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో తహసీల్దారు భాగ్యలత, డివిజనల్ సర్వేయరు క్రిష్ణమూర్తి, మండల సర్వేయరు దేవి, ఆర్ఐ చాణుక్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వగళ్ల పంచాయతీ కొండకిందపల్లె, హరిజనవాడ, బుర్రావాండ్లపల్లె, వగళ్ల కస్పాలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో అందిన లబ్ధి గురించి చదివి వినించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో ఓ వర్గానికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అదే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా అన్ని వర్గాల ప్రజలకు కులమత భేదం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో తమ ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని తెలిపారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతోందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోరే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వగళ్ల కస్పాలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని ఏ సమస్య ఉన్నా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, నెడ్‌క్యాప్, ఏపీఐఐసీ డైరెక్టర్లు సుగుణమ్మ, ప్రదీప్‌రెడ్డి, నాయకులు రామకొండారెడ్డి, వెంకటసిద్ధులు, సతీష్‌రెడ్డి, ఖాదర్‌బాషా, రఘునాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మునిరెడ్డి, తాతయ్య, రెడ్డిమునెయ్య, శ్రీనివాసులు, పి. ద్వారకనాథరెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, సైపుల్లాఖాన్, శ్రీనివాసులురెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌లో ముగ్గురికి కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులను అందిస్తున్న ఆర్డీఓ

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ముగ్గురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఉద్యోగాలు పొందిన ముగ్గురికి విధులు నిర్వహించాల్సిన స్థానాలను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తూ కరోనా సమయంలో ముగ్గురు మృతి చెందారన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా మృతుల కుటుంబీకులకు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఆఫీస్ సబార్డినేట్‌లుగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అందులో పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్‌గా రాజేష్, నిమ్మనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి గౌతమి, సబ్ కలెక్టరేట్‌కు శివకుమార్‌ను కేటాయిస్తూ నియామక పత్రాలను అందించినట్లు చెప్పారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి



ఎంపీ మిథున్ రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీలు

వాల్మీకిపురం : ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఎంపీ స్వగృహంలో పట్టణంలోని మైనార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మసీదులు, పీర్లచావిడి అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో చర్చించి, త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా ముస్లింల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. అనంతరం ఎంపీమిథున్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, దర్గా కమిటీ చైర్మన్ సందానిబాషా, మైనార్టీలు ఇర్ఫాన్, సాదిక్, షాహిద్, మహమ్మద్‌అలి, జబ్బార్, గఫ్ఫార్, జబ్బార్, ఖాజాపీర్, జాకీర్, రషీద్, అషర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఘన జీవామృతం మేలు



ఘన జీవామృతం తయారు చేసిన ప్రకృతి వ్యవసాయి సిబ్బంది, రైతులు

వాల్మీకిపురం : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పంటలకు ఘన జీవామృతం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ రెడ్డిబాషా అన్నారు. శుక్రవారం మండలంలోని వెలగపల్లిలో రైతు గోవిందురెడ్డి 500 కిలోల ఘన జీవామృతం తయారు చేసి, పంటకు వేశారు. ఘన జీవామృతం వలన భూమి లోపల ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, తద్వారా మొక్కకు కావలసిన పోషకాలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుశీల, పెద్దరెడ్డెయ్య, రైతులు పాల్గొన్నారు.

'బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి'

వీసీకే పార్టీ రాష్ట్రనేత పీటీఎం శివప్రసాద్



మదనపల్లె : బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని, ఎంపీ సభ్యత్వాన్ని బర్తరఫ్ చేయాలని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, అప్పటి మంత్రి, డబ్ల్యూఎఫ్ఐ కోచ్‌ల వేధింపులపై మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించాల్సిన బీజేపీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి ఖ్యాతితెచ్చిన మహిళా రెజ్లర్లకు బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రైతుసంఘాలు ఇచ్చిన ఐదురోజుల గడువులోపు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్‌చేయాలని, లేనిపక్షంలో రెజ్లర్ల ఆందోళనలకు మద్దతుగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

రూ. 5 లక్షలతో పైపులైన్ల ఏర్పాటు



పైపులైను నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : స్థానిక ఆర్టీసీ నల్లగుట్ట, చిత్తూరు రోడ్డు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించడం ధ్యేయంగా రూ. 5 లక్షలతో పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శుక్రవారం పైపులైన్ల ఏర్పాటు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వారపు సంత నుంచి ఎస్‌కేడీ నగర్, ఆర్టీసీ నల్లగుట్ట, చిత్తూరు రోడ్డులో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పైపులైను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం పీలేరు వారపు సంతలో కొత్తగా ఏర్పాటు చేసిన చేపలమార్కెట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్‌షావలి, నాయకులు విక్టరీ వెంకటరమణారెడ్డి, బారేషా, సచిన్, కుసుమశేఖర్‌రెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురవీధులలో ఊరేగిన వేణుగోపాలుడు

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. శుక్రవారం రాత్రి రెడ్డి సంఘం వారిచే హనుమంత సేవ ఘనంగా నిర్వహించారు. తిరుపతి వాస్వ్యరాలు రాధిక మహా భారతంలోని రాజసూయ యాగం ఘట్టాన్ని వివరించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డి, పురోహితుడు సుబ్బనరసయ్యలు తెలిపారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ముదిరాజ్ సంఘం వారిచే గరుడ సేవ జరగనుంది.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని వంగిమళ్లలో కస్పాలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సునందా రెడ్డి ఆధ్వర్యంలో పూర్ణాహుతి పూజలు శుక్రవారం నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి), మధుసూధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కేవీపల్లె : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవన విలువలలో పర్యావరణ పరిరక్షణను ఓ భాగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు సమాజ బాగోగులు కోరుకుంటూ మంచి లక్షణాలు అలవర్చుకుంటే మన చుట్టూ ఉన్న వాతావరణంలో ఆత్మీయ అనుబంధం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిక్షణపై చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత విశ్వం కళాశాల



క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్‌గా నిలిచిన విశ్వం కళాశాల టీమ్

కురబలకోట : కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో పది రోజుల పాటు జరిగిన వైఎస్సార్‌సీపీ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో అంగళ్లు దగ్గరున్న విశ్వం కళాశాల (పాతకోట) టీమ్ విన్నర్‌గా నిలిచింది. రూ.30 వేలు నగదు బహుమతిని శుక్రవారం అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కురబలకోట పీడీఆర్ టీమ్‌కు రూ. 15 వేలు నగదు అందజేశారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు యువతలో స్నేహ భావాన్ని పెంచడానికి ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు ఆర్గనైజర్లు రైల్వే స్టేషన్ బాబి, వినోద్ తెలిపారు. టోర్నమెంట్‌కు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, యూత్ లీడర్ కల్వకుంట ప్రణయ్ రెడ్డి తమ వంతు సహకారాన్ని అందజేశారు. ప్రసాద్, నాగా,అశోక్, సాయి, హసన్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.

● బుల్లెట్టు.. ఐడియా అదిరేట్టు!



వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు, దూరప్రయాణాన్ని సాఫీగా చేసేందుకు బుల్లెట్టు బండికి ఓ యువకుడు గొడుగును అమర్చుకుని అందరి దృష్టిని ఆకర్షించాడు. పట్టణంలో రయ్‌మంటూ దూసుకువెళుతున్న గొడుగు అమర్చిన బుల్లెట్టును అందరూ అరే భలేగా ఉందే అంటూ ఆశ్చర్యంగా చూడటం కనిపించింది. ఎన్‌టీఆర్ సర్కిల్‌కు చెందిన ఇంజినీర్ మగ్బూమ్ కొత్తగా కొనుగోలు చేసిన బుల్లెట్టు ప్రయాణంలో ఎండ నుంచి రక్షణ పొందేందుకు రూ.7వేలు ఖర్చుచేసి ఆన్‌లైన్‌లో గొడుగు కొనుగోలు చేసినట్లు చెప్పాడు. బండికి గొడుగు ఉన్నందున ఎండలో ఎంత దూరం ప్రయాణించినా ఇబ్బంది కలగడం లేదని, బైక్‌రైడ్‌ను ఎంజాయ్ చేస్తున్నట్లు మగ్బూమ్ చెప్పాడు. – మదనపల్లె

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణ కుమారి

వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్ల వీరగంగాభవాని అమ్మవారి జాతర సందర్భంగా పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణ కుమారిలు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు బలరాం, నారాయణ, పూజారి జనార్దన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కేశాలు దానం చేసిన పూజిత



కేశాలు దానం చేస్తున్న పూజిత

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల మోముల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక సొసైటీకాలనీకి చెందిన జి.కృష్ణమూర్తి కుమార్తె కృష్ణపూజిత హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు. నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ కృష్ణపూజితకు పూల మొక్కను అందించి అభినందించారు.

ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళి



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం స్థానిక పోలేరమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చలపతి, కిషోర్, రామాంజులు, రమణమ్మ, శ్యామల, మురళీ, భరత్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



మొక్కజొన్నవిత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, తరిగొండ పశువైద్యాధికారి సలీమ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తరిగొండ పశువైద్య కేంద్రంలో పాడిరైతులకు సబ్సిడీతో ఆఫ్రికన్ టాల్ రకం మొక్క జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరిగొండ పశువైద్య కేంద్రానికి 7టన్నుల మొక్కజొన్న విత్తనాలు వచ్చాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన



కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంజూరైన జగనన్న విద్యా కానుక కిట్లను స్థానిక మోడల్ స్కూల్‌లో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఎంఈఓ నారాయణ కిట్లను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మొదటి, రెండవ విడతల్లో 25 వేల పాఠ్య పుస్తకాలు, 3,732 జతల యూనిఫాం, 3,732 బ్యాగులు, 2,747 బెల్టులు, 766 డిక్షనరీలు భద్ర పరిచామన్నారు. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే వాటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామని ఎంఈఓ వెల్లడించారు. వీరి వెంట ప్రిన్సిపాల్ శివకుమారితో పాటు సీఆర్‌పీలు ఉన్నారు.

శిల్ప సోయగాల సంగమం



సోంపాళ్యం గ్రామంలోని ఆలయాల్లో ఆకట్టుకుంటున్న శిల్పకళ





ఆలయం గోపురంలో చెక్కుచెదరని శిల్పకళ, ఆలయంలో ఏకశిలతో చెక్కిన కల్యాణ మండపం

ములకలచెరువు : ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని సోంపాళ్యానికి ఆలయాల ఊరుగా పేరుంది. ఇక్కడ శ్రీచెన్నకేశవస్వామి, శ్రీచౌడేశ్వరీదేవి, నందీశ్వరుడు, శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాలు ఉన్నాయి. సోంపాళ్యంలో అప్పట్లో విజయనగర, చోళరాజులు పలు ఆలయాలను నిర్మించారు.

16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. ఆలయంలో అడుగు పెట్టినప్పటి నుంచి అద్భుత శిల్పాలు సందర్శకుల కళ్లను తిప్పుకోకుండా చేస్తాయి. ఆలయం లోపల ఏక శిలతో చెక్కిన రాతి రథం, రాతి కళ్యాణ మండపం ఉన్నాయి. అలాగే గొల్లమండపం, ఊంజల్ మండపాలు ఉన్నాయి. ఆలయం ఎదుట 60 అడుగుల భారీ ఏకశిల ధ్వజ స్తంభం ఉంది. ఈ ధ్వజస్తంభం దేశంలోనే పెద్దదైన వాటిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఆలయం ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. అదే విధంగా నందీశ్వరుడు, శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. వీటిని 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారు. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ గోపురాలపై పెరిగిన రావిచెట్లు కారణంగా గోపురం కూలిపోయింది.

11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని తమిళనాడు రాష్ట్రం తంజావూరు కేంద్రంగా రాజేంద్ర చోళ చక్రవర్తి పశ్చిమ చాళుక్యులపై యుద్ధం చేసి విజయం సాధించారు. దీనికి గుర్తుగా చౌడేశ్వరిదేవి ఆలయం నిర్మించారు. యుద్ధంలో విజయం సాధించడంతో చోళ చక్రవర్తి ఆరాధించే అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. యుద్ధ దేవతగా అమ్మవారు సప్త గ్రామాల ప్రజల పూజలందుకుంటున్నారు.